క్లుప్తంగా

వాకర్స్ సమస్య పరిష్కారంపై దృష్టి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలోని వాకింగ్ ట్రాక్ సమస్యపై ప్రిన్సిపాల్ సురేఖతో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు బుధవారం మాట్లాడారు. ట్రాక్ సరిగ్గా లేక వాకర్స్ ఇబ్బంది పడుతున్నారని.. పరిష్కారంపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ప్రిన్సిపాల్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారన్నారు. కావవరపు సిజు, ఎండ రమేష్, ఎస్.ఎస్.సురేష్, రమేష్, జామి రామారావు, రామచంద్రారెడ్డి ఉన్నారు.

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

ఎచ్చెర్ల: మండలంలోని ఇబ్రహీంబాద్, ఎస్ఎస్ ఆర్‌పురం గ్రామాలలో బుధవారం గ్రామదేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఉన్న అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



యర్రవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి అన్నారు. మండలంలోని 28 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శరవేగంగా సాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు 26 గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రావాడ, పాతర్లపల్లి పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో ప్రతీ కుటుంబానికి వైద్య సేవలు అందజేస్తామన్నారు.

క్రీడాకారులకు సన్మానం



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న అప్పలనాయుడు

లావేరు: మండలంలోని మురపాక గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి తేనేల నీలమాధవనాయుడు, చింతు సింధు అండర్-14 విభాగం ఖోఖో జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మండలంలోని పెదలింగాలవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు బుధవారం సత్కరించారు. ఇద్దరు విద్యార్థులకు క్రీడాదుస్తులు, కొంత ఆర్థికసాయం అందజేశారు. అలాగే స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు 100 దోమ తెరలను పంపిణీ చేశారు. స్కూల్ చైర్మన్ తేనేల సురేష్‌కుమార్, కొత్తకోట మాజీ సర్పంచ్ నాగరాజు, ప్రిన్సిపాల్ బి.ప్రసాద్, పీడీ రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ గురునాయుడు, యందవ శ్రీనివాసరావు, చందక నాగరాజు, గొర్లె సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో 'కాఫీ విత్ క్లాప్ మిత్ర'



క్లాప్ మిత్రలను సన్మానిస్తున్న అధికారులు

గార: ప్రజారోగ్య పరిరక్షణలో క్లాప్ మిత్రల సేవలు సమర్థవంతమైనవని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో క్లాప్ మిత్రలకు తేనీటి విందుతో పాటు ఆరోగ్య పరీక్షలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో గోపీబాల మాట్లాడుతూ.. క్లాప్ మిత్రల సహకారంతో స్వచ్ఛత శతశాతం నిర్వహించగలుగుతున్నామన్నారు. ప్రజల నుంచి కూడా సహకారం అవసరమన్నారు. ముందుగా క్లాప్‌మిత్రలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అల్పాహారం, తేనేటి విందును అందించారు. దుశ్శాలువులతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరు అనిత, డీపీఆర్‌సీ డీసీ పి.వెంకటరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ అందవరపు రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, పంచాయితీ కార్యదర్శి చెట్టు శంకరరావు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి

- హెరిటేజ్ వాక్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు
- ఘనంగా పర్యాటక దినోత్సవం



అరసవల్లి: హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ ఓబులేసు

అరసవల్లి: పర్యాటకం కూడా సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమేనని శ్రీకాకుళం నగరపాలకసంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. విద్యార్థి దశ నుంచే సంప్రదాయాల పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్థానిక మహిళా కళాశాల నుంచి జామియా మసీదు వరకు విద్యార్థులు బుధవారం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. వాక్‌ను ప్రారంభించిన ఓబులేసు మాట్లాడుతూ.. సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు మాట్లాడుతూ.. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి మంచి అవకాశాలు, అనుకూల వాతావరణం ఉందన్నారు. ప్రతి పర్యాటక ప్రాంతంలో పచ్చని చెట్లను పెంచాలనే నినాదంతో పనిచేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వివరించారు. అనంతరం టూరిజం యువక్లబ్ విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడాలని, పచ్చని మొక్కలు పెంచాలని నినాదాలు చేశారు. జామియా మసీదు వద్ద యువక్లబ్ సభ్యులు, అధికారులు సంప్రదాయాలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, డీపీఆర్వో బాలమానసింగ్, జిల్లా ఉపాధి అధికారి సుధ, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణ, టూరిజం సిబ్బంది రమేష్, జామియా మసీద్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

గార: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కె.మత్స్యలేశం సర్పంచ్ బి.లలిత అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుద్దా పాఠశాలలోని యువటూరిజం క్లబ్ విద్యార్థులు, హరిత రిసార్టు సిబ్బంది సంయుక్తంగా బీచ్ శుభ్రత చేపట్టారు. బీచ్‌లోని చెత్తా చెదారాన్ని తొలగించి కాల్చివేశారు. ప్లాస్టిక్ నిషేధం, పచ్చని చెట్లు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చంద్రమతి, బుద్దా స్కూల్ చైర్మన్ బి.ఎర్రన్న, కోఆర్డినేటర్ కుమార్, ఉపాధ్యాయులు వాసుదేవరావు, శ్రీను, ఆదినారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



అరసవల్లి: జామియా మసీదు వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న యువ క్లబ్ సభ్యులు



గార: బీచ్ క్లీనింగ్‌లో యువటూరిజం క్లబ్ సభ్యులు

వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రణస్థలం: రణస్థలం, లావేరు మండలాల్లోని రైతు సేవా సహకార సంఘం ఖాతాదారులకు సకాలంలో రుణాలు అందజేస్తున్నామని ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ మార్కెండేయస్వామి తెలిపారు. రణస్థలం మండల కేంద్రంలోని రణస్థలం రైతు సేవా సహకార బ్యాంక్ 64వ మహాజన సభ సమావేశం ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు కిల్లారి రమణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మార్కెండేయ స్వామి మాట్లాడుతూ గతంలో బంగారు రుణాలు తీసుకున్న ఖాతాదారుల నుంచి ప్రోసెసింగ్ చార్జీలు రూ.650, డాక్యుమెంట్ చార్జీలు రూ.30 తీసుకునేవాళ్లమన్నారు. ప్రస్తుతం ఈ చార్జీలు లేకుండా జీరో ప్రాతిపదికన బంగారం రుణాలు అందజేస్తున్నామన్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని, త్వరలో ఆ పనులకు సంబంధించిన చర్యలు చేపడతామన్నారు. 2022–23లో తమ బ్యాంక్ ద్వారా మూడు వేల మంది రైతులకు రూ.12 కోట్లు వ్యవసాయ రుణాలు, 1250 మంది ఖాతాదారులకు బంగారం రుణాలు రూ.7 కోట్లు అందించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులకు వ్యవసాయ రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ ద్వారా ఈ రెండు మండలాల్లో ఎంతో మంది రైతులకు రుణాలు అందుతున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, నాయకులు పైడి శ్రీనివాసరావు, దన్నాన రాజీనాయుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, సంఘ డైరెక్టర్లు దన్నాన సూర్యనారాయణ, గులివిందల కన్నప్పుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారులు

జి.సిగడాం: మండలంలోని దేవరవలస పంచాయతీ పరిధి మంగమ్మపేటలో మొక్కజొన్న పంటను జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ త్రినాథస్వామి, శాస్త్రవేత్తలు వై.రాజశేఖర్, అమరజ్యోతి, రణస్థలం ఏడీఏ వడ్డాది శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు లంకలపల్లి శేఖర్.. ఇటీవల జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందనలో మొక్కజొన్న పంట పూర్తిగా నాశనమైందని, పంటల బీమా పథకం వర్తింపజేయాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు.. రైతు పండించిన మొక్కజొన్న పంటను అధికారులు పరిశీలించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రతీరైతు ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని, అప్పుడే చీడపీడలు అదుపులో ఉంటాయన్నారు. పంట పొలాల్లో ఎరువులు వేసే ముందు వ్యవసాయ శాఖాధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు.

వైభవంగా గణపతి ఉత్సవాలు



రణస్థలం: గొర్లెపేట వినాయక విగ్రహాన్ని దర్శించుకున్న పిన్నింటి సాయికుమార్



రణస్థలం: జే.ఆర్.పురంలో అన్నసమారాధన

రణస్థలం: మండలంలోని గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గొర్లెపేట, కంబాలపేట, జే.ఆర్.పురం ఎమ్మార్వో ఆఫీస్ సమీపంలో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. గొర్లెపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చినరామినాయుడు, గొర్లె అప్పలనాయుడు, నాయకులు మహంతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దీపారాధన..

లావేరు: మండలంలోని రేగపాలెంలో బుధవారం లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు దీపారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శివలింగం, ఓం, స్వస్తిక్ ఆకారంలో దీపాలు వెలిగించారు. కేశవరాయునిపురంలో వినాయకుని నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు నిర్వహించారు. వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాట నిర్వహించారు. పెదకొత్తపల్లి పంచాయతీలో వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 10 కేజీల లడ్డూకు వేలం పాట నిర్వహించారు. బగ్గు శ్రీనివాసరావు రూ.లక్షకు లడ్డూను దక్కించుకున్నారు.



లావేరు: రేగపాలెం వినాయకుని విగ్రహం వద్ద దీపారాధన

సీఎం జగన్‌ను కలిసిన ఎం.వి.స్వరూప్



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న ఎం.వి.స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణాలు, సొండి, కళింగవైశ్య, తూర్పుకాపు, అరవలను ఓబీసీలో చేర్చేందుకు ఎన్‌సీబీసీ సిఫార్సు చేసినందుకుగాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్‌ను అమరావతిలో బుధవారం స్వరూప్ మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ కులగణన కోసం అధ్యయన కమిటీ వేసినందుకు బీసీలంతా జీవితకాలం రుణ పడి ఉంటారని సీఎంతో అన్నారు.

మహానందీశ్వరునికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలోని మహానందీశ్వరునికి బుధవారం క్షీరాభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో త్రయోదశి సందర్భంగా ప్రదోషకాల సమయంలో క్షీరాభిషేకాలు నిర్వహించారు.

అయ్యప్పస్వామికి పూజలు



క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవకొండ శంకర నారాయణశర్మ భక్తులతో పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సౌత్‌జోన్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో పాఠశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నాలుగో సౌత్‌జోన్ పెన్‌కాక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు శ్రీకాకుళంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పోటీలు అక్టోబర్ ఒకటి, రెండు తేదీల్లో కేరళలోని త్రివేంద్రం వేదికగా జరగనున్నాయి. ఎంపికైన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ ముద్దాడ సత్య ప్రసాద్, ప్రిన్సిపాల్ తరిని అర్జున్ చక్రవర్తి అభినందించారు. కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు, జిల్లా పెన్‌కాక్ శిలాట్ అధ్యక్షుడు రేగిడి దయామయ, అందవరపు రమేష్, కోఆర్డినేటర్ శిరీష, కోచ్ గౌతమి, పీఈటీ లలిత ఉన్నారు.

కళాశాల ప్రగతి పరిశీలన

- ఉమెన్స్ కళాశాలలో బీవోఎస్ సమావేశం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికిగాను బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) సమావేశం బుధవారం జరిగింది. యూనివర్సిటీ ప్రతినిధులు, డిగ్రీ కళాశాలల సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్, ఇండస్ట్రీయలిస్టులు హాజరై కళాశాలలోని 18 విభాగాలను పరిశీలించారు. వివిధ విభాగాల మేజర్, మైనర్ కోర్సులు, పాఠ్యప్రణాళికలు, మోడల్, యాడ్ ఆన్, సర్టిఫికెట్, స్వల్పకాలిక, లాంగ్‌టెర్మ్, స్కిల్ డెవలప్‌మెంట్, లైఫ్ స్కిల్స్ కోర్సులపై ఆరా తీశారు. సెమినార్లు, వర్క్‌షాపులు వంటి అంశాలను, అందుకు సంబంధించిన రికార్డు, ప్రాజెక్టు పుస్తకాలను పరిశీలించారు. వసతులు, ఏర్పాట్లు, కోర్సుల అధ్యయనం పట్ల పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ కళాశాల ప్రగతి, సాధించిన ఫలితాలను, అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, వసతులను పరిశీలకులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, కనకదుర్గ, సీహెచ్ కాత్యాయణి, సంతోష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సుధాకర్ ప్రసాద్‌కు ఘనంగా నివాళి



సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళం పట్టణంలోని రెవెన్యూ అతిథి భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అక్టోబర్ ఒకటో తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి రెవెన్యూ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు డి.పద్మావతి, జి.రామలింగేశ్వరరావు, ఈసీ మెంబర్ డి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం డివిజన్ సహాధ్యక్షుడు ఎస్.గణపతి, కార్యదర్శి డి.ప్రకాశరావు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ నామసంకీర్తన



హాజరైన సత్యసాయి భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు, వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక పెద్దమందిరంలో నిర్వహిస్తున్న వందగంటల అఖండ నామ సంకీర్తన బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సత్యసాయి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. మానవునిలో ఉన్న అశాంతిని, అసుర గుణాలను తొలగించి దివ్యత్వంవైపు నడిపించడానికి నామ సంకీర్తన అనేక అద్భుత ఆధ్యాత్మిక విప్లవాన్ని తెచ్చిందని అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా దేవాలయాలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాలను శుభ్రపరచి మొక్కలను నాటుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కమల త్రివేణి, జిల్లా అధ్యక్షులు వై.లింగరాజు, రిమ్స్ అన్నపూర్ణ ట్రస్టు అధ్యక్షుడు జి.రమణబాబు, ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాథగుప్త, జోనల్ కన్వీనర్ నాగేశ్వరరావు, మందిరం కన్వీనర్ కె.మురళికృష్ణ, ఫాల్గుణరావు, సర్వేశ్వరరావు, నాగభూషణం పాల్గొన్నారు.

జాషువా రచనలు అజరామరం




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాలలో బుధవారం గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ పైడి వెంకటరమణ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాషువా కవిత్వం చదవడం ద్వారా విద్యార్థులు ఎంతగానో స్ఫూర్తి పొందవచ్చన్నారు. గబ్బిలం, ఫిరదౌసి, క్రీస్తు చరిత్ర వంటి గొప్ప రచనలు చేసిన జాషువా విశ్వమానవ కవిగా పేరుగాంచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు లెక్చరర్లు పి.నారాయణరావు, డాక్టర్ ఢిల్లీశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ రామారావు, డాక్టర్ శశిభూషణ్, డాక్టర్ ప్రమీల, డాక్టర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి తేవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా కోర్టు ప్రధాన గేటు వద్ద బుధవారం జిల్లా బార్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, బీసీ అసోసియేషన్ అడ్వకేట్స్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కూన అన్నం నాయుడు, బీసీ అసోసియేషన్ అడ్వకేట్ అధ్యక్షుడు ఉమామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, సీనియర్ లాయర్లు సనపల హరి, పొన్నాడ వెంకటరమణారావు, ఎం.భవాని ప్రకాష్, ఇంటి గోవింద్, న్యాయవాదులు యాగళ్ల ప్రసన్నకుమార్, కిల్లి శ్రీరామ్మూర్తి, కార్యదర్శి పొన్నాడ రాము, బి.వి.రమణ, ఏ.కృష్ణరాజు, వెంకటేశ్వరరావు, టీ వరప్రసాద్, ఎం.వి.సత్యం, బెజ్జిపురపు ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

విజయ గణపతికి దీపారాధన



నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి బుధవారం భక్తులు దీపారాధనలు చేశారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

శ్రీకాకుళం కల్చరల్

బాల్‌బ్యాడ్మింటన్‌లో వప్పంగి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు వప్పంగి విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యతోపాటు క్రీడల్లోను రాణిస్తున్న విద్యార్థులను వైఎస్సార్‌సీపీ నేత చల్లా రవి బుధవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. యు.పావని, ఆర్.భువనేశ్వరి, బి.జ్యోష్న, పీ.జితేంద్ర రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్లు బీసీహెచ్ మాధురి, పైడి సునీతలు తెలిపారు. నంద్యాలలో జరగనున్న రాష్ట్రపోటీల్లో పాల్గొంటారని చెప్పారు.